(యోహాను 5:24, 25).

**మానవుని రక్షించుటకు దేవుడు సువార్త ప్రకటనను ఒక సాధనముగా వినియోగిస్తారు :** మట్టి ఘటములైన వారిలో సువార్త ఉంచబడియున్నది (2 కొరింథీ 4:5). "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి, నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును, నమ్మని వానికి శిక్ష విధించబడునని" యేసు తన శిష్యులకాజ్ఞాపించారు (మార్కు 16:15,16). "దేవుని జ్ఞానానుసారముగా లోకము తన జ్ఞానము చేత దేవుని ఎరుగకుండినందున సువార్త ప్రకటనయను వెర్రితనము చేత నమ్ము వారిని రక్షించుట దేవుని దయాపూర్వక సంకల్పమాయెను" (1 కొరింథి 1:21). సువార్త ప్రకటన ద్వారా ప్రజలు దేవుని తెలిసికొనాలి. అది దేవుని సంకల్పము.

**సువార్త ప్రకటించుటలో గొప్ప సంగతులు సంభవించును :** పేతురు మొట్టమొదటి సువార్త ప్రసంగము చేయగా ఇంచుమించు మూడువేల మంది హృదయములో నొచ్చుకొని రక్షణను కోరుకొన్నారు (అపొ.కా. 2:37). ఫిలిప్పు నపుంసకునికి బోధించగా సువార్తను గ్రహించుకొని బాప్తిస్మముపొందాడు (అపొ.కా. 8:27-39). ఏథెన్సులో పౌలు సువార్త ప్రకటింపగా కొందరు హేళన చేసారు గాని మరికొందరు అతని హత్తుకొన్నారు (అపొ.కా. 17:32-34).

**మానవకల్పితబోధలు, పారంపర్యములు సంఘములను ఖాళీగా ఉంచును :** కల్పనా కథలతోను, మానవ సొంతభావములతోను బోధించబడే సువార్త ఎవరినీరక్షించదు. అది చెవి కింపుగా యుండ వచ్చును గాని సత్యమును సంపూర్తిగా ప్రజలకు తెలియజేయవు. ఒకడు బోధించిన దేవోక్తులను బోధించినట్టు బోధించవలెను (1పేతురు 4:11). దేవుని సంకల్పము నంతయు బోధింపవలెను (అపొ.కా. 20:27). తద్వారా దేవుడు మహిమపరచబడును.

-సీసెల్మే



**సత్యవాక్కు**
పోస్టు బాక్స్ - 80, కాకినాడ
ఆంధ్రప్రదేశ్ - 533 001.
ఫోన్ : 0884-2363722, సెల్ : 98489 98547
ఎడిటర్ : జాషువా గూటం

క్రొత్త నిబంధన క్రైస్తవ పునరుద్ధరణ కొరకు

సంపుటి - 43 డిశంబరు - 2021 సంచిక -5

## "నీవు క్రైస్తవుడవయిన తరువాత..."

నీవు క్రైస్తవుడయినప్పుడు నీలో కలిగే మార్పును గూర్చియు, నీకు కలిగే దీవెనలను గూర్చియు గత మా పాఠములో నేర్చుకొంటిమి. నీవు క్రైస్తవుడవయిన తరువాత చేయవలసిన దేమిటో దానిని గూర్చి ఈ రోజు కొంత తెలిసి కొందుము. ఒకడు యేసునందు విశ్వాసముంచి, బాప్తిస్మము ద్వారా ఆయనకు విధేయత చూపించి క్రైస్తవుడవగానే అతని ఆత్మీయ జీవితము లేక జీవిత యాత్ర అంతము కాదు గాని అది ఆరంభమగును. దేవుని యొక్క మెప్పును, నిత్యజీవ కిరీటమును అతడు పొందవలెనంటే మరణ పర్యంతము నమ్మకముగా యుండవలెను.

**నీవు క్రైస్తవుడవయినప్పుడు నూతన జీవితము కలిగి జీవించెదవు.** ప్రతివాడును బాప్తిస్మమను నీటి సమాధి నుండి నూతన జీవితము కలిగి జీవించు నిమిత్తము లేపబడును (రోమా 6:3,4). అతడు క్రైస్తవుడు కాక ముందు జీవించిన పాపజీవితమును ఇక జీవించడు. వాటన్నిటిని క్రీస్తు సిలువ నీడలో అతడు పాతిపెట్టును. ఇప్పుడు క్రీస్తును ధరించిన క్రొత్త వ్యక్తి అతడు. పాతవి గతించెను. ఇదిగో

సమస్తమును క్రొత్తవాయెను (1కొరింధీ 5:17).

**క్రైస్తవుడయిన ప్రతివాడును దేవుని వాక్యమనే పాలను ఆశతో ఆపేక్షించును.** "ప్రభువు దయాళుడని మీరు రుచి చూచియున్న యెడల సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్త దూషణ మాటలను మాని, క్రొత్తగా జన్మించిన శిశువులను పోలిన వారై నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగు నిమిత్తము ఆ పాలను ఆపేక్షించుడి" యని అపొ. పేతురు హెచ్చరించు చున్నాడు (1 పేతురు 2:3). క్రైస్తవుడు నీతికొరకు ఆకలిదప్పులు కలిగియుండును (మత్తయి 5:6). అట్లున్నప్పుడు ఆత్మీయముగా బలమైన ఆహారమును అతడు భుజించగలడు.

**నీవు క్రైస్తవుడ వయిన తరువాత దినదినము ఆత్మీయముగా పెరుగవలెనని దేవుడు కోరుచున్నారు.** ఈ పెరుగుదల దేవుని వాక్యమును అభ్యసించుట వలన కలుగును. ఆత్మీయాభివృద్ధిని కనబరచలేని వారిని పరిశుద్ధాత్ముడు ఇట్లు ఖండించు చున్నాడు : "కాలమును బట్టి చూచితే మీరు బోధకులుగా ఉండవలసినవారై యుండగా దేవోక్తులలో మొదటి మూలపాఠములను ఒకడు మీకు మరల బోధింపవలసి వచ్చెను. మీరు పాలు త్రాగవలసిన వారేగాని బలమైన ఆహారము తినగలవారు కారు. మరియు పాలుత్రాగు ప్రతివాడును శిశువే గనుక నీతివాక్య విషయములో అనుభవము లేనివాడై యున్నాడు. వయస్సు వచ్చినవారు అభ్యాసముచేత మేలు కీడులను వివేచించుటకు సాధకము చేయబడిన జ్ఞానేంద్రియములు కలిగియున్నారు గనుక బలమైన ఆహారము వారికే తగును" (హెబ్రీ 5:12-14). ఆత్మీయాకలి లేనివాడు ఆత్మీయ రోగమును కలిగియున్నాడు.

**నీవు క్రైస్తవుడవయినావు గనుక క్రీస్తు నామమును, క్రైస్తవుడను నామమును మహిమ పరచెదవు.** "ఎవ



డైనను క్రైస్తవుడయినందుకు బాధ అనుభవించిన యెడల అతడు సిగ్గుపడక, ఆ పేరును బట్టియే దేవుని మహిమ పరచవలెను" అని 1పేతురు 4:16 బోధించుచున్నది. క్రైస్తవుడను పేరు దూషించబడకుండునట్లు నీవు జీవించవలెను (యాకోబు 2:7).

నీవు క్రైస్తవుడవయితివి గనుక దేవుని నారాధించుటలో నిలకడగా యుండవలెను. ఆదిమ క్రైస్తవులు అపొస్తలుల బోధయందును, సహవాసమందును, ప్రార్థనచేయుట యందును, రొట్టెవిరుచుటయందును నిలకడగా యుండిరి (అపొ.కా. 2:42). ఇంకొక మాటలో దేవుని నారాధించుటలో వారు యెడతెగక నిలకడగా యుండిరి. క్రైస్తవుడయిన ప్రతివాడు ప్రతీ ఆదివారమున క్రైస్తవులతో కలసి దేవుని నారాధించవలెను. వారు ఆరాధనకు కూడి వచ్చినప్పుడు పాటలు పాడవలెను, ప్రార్థన చేయవలెను, వాక్యోపదేశము జరిగించవలెను, కానుకలీయవలెను. ఈ ఆరాధన క్రియలను వారు ఆత్మతోను సత్యముతోను జరిగించవలెను.

**క్రైస్తవుడయిన ప్రతివానికి దేవుని నారాధించు గొప్ప తరుణము ఈయబడియున్నది.** మరీముఖ్యముగా ప్రభువు బల్ల చుట్టూ కూర్చుని ప్రభువుతో సహవాసము కలిగియుండు తరుణము ఈయబడియున్నది. గనుక ప్రతి ఆదివారమున క్రైస్తవుడు ఆరాధనకు తప్పక హాజరుకావలెను. "కొందరు మానుకొనుచున్నట్టుగా సమాజముగా కూడుట మానక, ఒకని నొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగుచేయుచు ప్రేమ చూపుటకును, సత్కార్యములు చేయుటకును ఒకని నొకడు పురికొల్పవలెనని ఆలోచింతము" అని పరిశుద్ధాత్ముడు అపొ.పౌలు ద్వారా లిఖించెను (హెబ్రీ 10:25). క్రైస్తవుడు క్రీస్తునందలి విశ్వాసములో స్థిరముగా యుండిన యెడల యితరులు దానిని చూచి ఆశ్చర్యపడుదురు, ఆనందింతురు (కొలస్స 2:5).

**నీవు క్రైస్తవుడ వయినందున పైనున్నవాటినే వెదుకవలెను.** క్రైస్తవుడు బాప్తిస్మమందు ఆయనతో కూడ పాతి పెట్టబడినవాడై ఆయనను మృతులలో నుండి లేపిన దేవుని ప్రభావమందు విశ్వసించుటద్వారా ఆయనతో కూడ లేచిన వాడని కొలస్స 2:12 చెప్పుచున్నది. గనుకనే "మీరు క్రీస్తుతో కూడ లేపబడినవారైతే పైనున్న వాటినే వెదకుడి. అక్కడ క్రీస్తు దేవుని కుడి పార్శ్వమున కూర్చుండి యున్నాడు" అని కొలస్స 3:1,2లో క్రైస్తవులు హెచ్చరింపబడియున్నారు.

మన తండ్రియైన దేవుడు పైన ఉన్నాడు గనుక క్రైస్తవుడు పైనున్న వాటినే వెదుకవలెను (మత్తయి 6:9). మన ధనము, మన పౌరసత్వము, మన నిరీక్షణ, మన స్వాస్థ్యము, మన రక్షకుడు పైనే యున్నారు గనుక మనము పైనున్న వాటినే వెదుకవలెను. ఒక్కడే మీ తండ్రి; ఆయన పరలోకమందున్నాడు అని యేసు చెప్పెను (మత్తయి 23:9). భూమి మీద మీ కొరకు ధనమును కూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మటయు తుప్పును తిని వేయును, దొంగలు కన్నమువేసి దొంగిలెదరు. పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను తినివేయుదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు అని ఆయన బోధించెను (మత్తయి 6:19,20). మన పౌరస్థితి పరలోకమందున్నది; అక్కడ నుండి ప్రభువైన యేసుక్రీస్తు అను రక్షకుని నిమిత్తము కనిపెట్టుకొని యున్నాము అని ఫిలిప్పీ 3:20లో అపో.పౌలు వ్రాసెను. మన రక్షకుడు ఎక్కడ ఉన్నాడో అక్కడనే మన నిరీక్షణ యున్నది. అందువలన క్రైస్తవుడు ఈ లోకమునుగాని, ఈలోక సంగతులను గాని ప్రేమింపరాదు. అతడు పైనున్న వాటినే లక్ష్యపెట్ట వలెను.

**నీవు క్రైస్తవుడవైతివి గనుక రక్షకుడైన యేసుక్రీస్తును గూర్చి యితరులకు ప్రకటించవలెను.** క్రీస్తు శిష్యులు యేసే దేవుని కుమారుడని



ప్రకటించవలెను (అపో.కా.9:20). వాక్యమును ప్రకటించుము; సమయమందును అసమయమందును ప్రయాసపడుము అని యౌవనుడైన తిమోతిని పౌలు హెచ్చరించెను (2 తిమో 4:2). నీవు యితరులను రక్షించుటకు రక్షింపబడితివి, యితరులను కనుగొనుటకు కనుగొనబడితివి, యితరులకు బోధించుటకు బోధింపబడితివి, అనేకులను క్రీస్తుకు శిష్యులనుగా చేయుటకు క్రైస్తవుడవయితివి. నీ జీవితము అనేకులకు మార్గదర్శిగా యుండవలెను. మనుష్యులు నీ సత్క్రియలను చూచి పరలోకమందున్న తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట నీ వెలుగును ప్రకాశింపనీయవలెను.

**నీవు క్రైస్తవుడవైతివి గనుక విశ్వాసమునుండి పడిపోకుండ జాగ్రత్తగా చూచుకొనుము.** నీవు క్రైస్తవుడవైన తరువాత ఈలోక మాలిన్యములలో మరల చిక్కుబడి వాటిచేత జయింపబడినయెడల నీ కడవరి స్థితి మొదటి స్థితి కంటె మరిచెడ్డదగును. గనుక కడవరివరకు నీవిశ్వాసమును, నీ రక్షణను భయముతోను, వణకుతోను కొనసాగించుకొనుము.

నీవు ఈలోక మాలిన్యములలో చిక్కుబడిపోకుండు నిమిత్తము ప్రతి దినము దేవునితో మాట్లాడుటకు, అంటే ప్రార్థన చేయుటకు అలవాటు పడుము. మరల ప్రతి దినము దేవుని నీతో మాట్లాడనీయుము. ఆయన వాక్యమును దివారాత్రులు ధ్యానించుము. వాక్యము ద్వారా ఆయన నీతో మాటలాడును. నీవు దేవునిపై ఆధారపడి నడుచుకొనిన యెడల ప్రతి విధమైన శోధననుండి ఆయన నిన్ను తప్పించును.

ఈ వర్తమానమును చదువుచున్న నీవు యింకను క్రైస్తవుడవు కానియెడల, యేసుక్రీస్తునందు విశ్వాసముంచుము, నీ పాపముల విషయమై మారుమనస్సు పొందుము, యేసును ఒప్పుకొని పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. క్రైస్తవుడవై క్రీస్తుతో నీ జీవితయాత్ర కొనసాగించుము!!

## యూదల రాజుగా పుట్టినవాడెక్కడ ఉన్నాడు?

అపొస్తలుడైన మత్తయి ఈ సువార్తను యూదులకు వ్రాసెను. నజరేయుడైన యేసు మెస్సియ్య అనియు లేక యూదుల రాజనియు పాత నిబంధనలోని ప్రవచనములను ఎత్తిచూపుచూ యూదులను అతడు ఒప్పించుచుండెను.

గ్రంధకర్త ఈ మత్తయి సువ్తార రెండవ అధ్యాయము 1-12 వచనములలో 5 ప్రాముఖ్యమైన విషయములను తెల్పెను.

1. యేసు మెస్సియ్య అనియు లేక యూదుల రాజనియు మరియు ఆయన స్తుతులకు పాత్రుడనియు చెప్పెను.
2. యేసుక్రీస్తును యూదులు మాత్రమే కాదు. సమస్త దేశప్రజలంద రును ఆరాధించవలెననియు చెప్పెను. (జ్ఞానులు : వీరు అన్యులు).
3. యూదులేమి, అన్యులేమి అందరును ఆయనను వెదకవలెననియు (జ్ఞానులు వలె) మరియు తెలుసుకొనవలెననియు చెప్పెను.
4. ఆయనకు మ్రొక్కని ప్రజలు ఉందురనియు, అటువంటి ప్రజలకు ఆయన కలవరపాటుగా ఉండునని మత్తయి చెప్పెను (హేరోదును, యెరూషలేమువారు కలవరపడిరి).
5. యేసుక్రీస్తును ఆరాధించ డంలోను, ఆయన రాజ్యాధికారమునకు లోబడుటలోను సంతోషం కలదని మత్తయి చెప్పుచున్నాడు.

**యేసుక్రీస్తు రాజు అని లేఖనములలో చెప్పబడెను :-**

1. **యెషయా 9:6 :** "ఏలయనగా మనకు శిశువు పుట్టెను. మనకు కుమారుడు అనుగ్రహింపబడెను ఆయన భుజము మీద రాజ్యభారముండును. ఆశ్చర్యకరుడు ఆలోచనకర్త బలవంతుడైన దేవుడు నిత్యుడగు తండ్రి సమాధాన కర్త యగు అధిపతి అని అతనికి పేరు



పెట్టబడును".

2. **దానియేలు 7:13, 14 :** "రాత్రి కలిగిన దర్శనములను నేనింక చూచుచుండగా, ఆకాశమేఘారూఢుడై మనుష్యకుమారుని పోలిన యొకడు వచ్చి, ఆ మహావృద్ధుడగు వాని సన్నిధిని ప్రవేశించి, ఆయన సముఖమునకు తేబడెను. సకల జనులును రాష్ట్రములను ఆయా భాషలు మాటలాడువారును ఆయనను సేవించునట్లు ప్రభుత్వమును మహిమయు ఆధిపత్యమును ఆయన కీయబడెను. ఆయన ప్రభుత్వము శాశ్వతమైనది. అదెన్నటికిని తొలగిపోదు, ఆయన రాజ్యము ఎప్పుడును లయముకాదు".

**యేసుక్రీస్తు భిన్నమైన రాజుయై యున్నారు :-**

1. **లూకా 2:6,7 :** "వారక్కడ ఉన్నప్పుడు ఆమె ప్రసవ దినములు నిండెను గనుక తన తొలిచూలు కుమారుని కని, పొత్తిగుడ్డలతో చుట్టి, సత్రములో వారికి స్థలము లేనందున ఆయనను పశువుల తొట్టిలో పరుండబెట్టెను".

రాజులు రాజగృహములలో జన్మించుదురు. మరియు బంగారు ఊయలలో పరుండబెట్టబడుదురు. ప్రశస్త వస్త్రములు ధరింపజేయుదురు. కాని మన రాజు పశువుల తొట్టిలో పరుండబెట్టబడెను. సత్రములో స్థలము చాలాచిన్నదిగా ఉండెడిదని గదులు చిన్నవిగా ఉండేవనియు మరియు ప్రజలు ప్రయాణించిన పశువులు కూడా సత్రములో ఒక స్థలములో ఉంచబడెడివనియు చెప్పుదురు.

2. **లూకా 19:35-38 :** "తరువాత వారు యేసునొద్దకు దానిని తోలుకొనివచ్చి, ఆ గాడిదపిల్ల మీద తమ బట్టలు వేసి, యేసును దాని మీద ఎక్కించి, ఆయన వెళ్ళుచుండగా తమ బట్టలు దారి పొడుగున పరచిరి. ఒలీవల కొండ నుండి దిగుచోటికి ఆయన సమీపించు

చున్నప్పుడు శిష్యుల సమూహమంతయు సంతోషించుచు ప్రభువు పేరట వచ్చురాజు స్తుతింపబడును గాక పరలోక మందు సమాధానమును సర్వోన్నతమైన స్థలములలో మహిమయు ఉండును గాక అని తాము చూచిన అద్భుతములన్నిటిని గూర్చి మహాశబ్ధముతో దేవుని స్తోత్రము చేయసాగిరి". ఇది జెకర్యా 9:9 నెరవేర్పుయైయున్నది. రాజులు గుర్రముల మీదను, రథముల మీదను ప్రయాణించుదురు. యేసు గాడిదపిల్లపై ఊరేగెను. గుర్రము యుద్ధమునకు గుర్తుగా, గాడిద శాంతికిని, సామాన్యప్రజలతో ఆయనకు గల సంబంధమునకును గుర్తుగా ఉన్నది.

**3. మత్తయి 27:29 :** "ముండ్ల కిరీటమును అల్లి ఆయన తలకు పెట్టి, ఒక రెల్లు ఆయన కుడిచేతిలో నుంచి, ఆయన యెదుట మోకాళ్లుని – యూదుల రాజా, నీకు శుభమని ఆయనను అపహసించిరి."

మహారాజుల బంగారు కిరీటమును మరియు వజ్రవైడూర్యములతో చేయబడిన కిరీటమును తలపై ధరింతురు. అయితే మన రాజుకు ముండ్లతో చేయబడిన కిరీటము తలకు పెట్టబడెను.

**4. యోహాను 18:15,16 :** "అందుకు వారు – ఇతనిని సంహరించుము, సంహరించుము, సిలువ వేయుము అని కేకలు వేసిరి. పిలాతు మీ రాజును సిలువ వేయుదునా? అని వారిని అడుగగా ప్రధాన యాజకులు కైసరు తప్ప మాకు వేరొక రాజు లేడనిరి. అప్పుడు సిలువ వేయబడుటకై అతడాయనను వారికి అప్పగించెను".

రాజులు తలచుకుంటే దెబ్బలకు కొదువా అని చెప్పుదురు. రాజులు ఇతరుల ప్రాణములను సునాయాసముగా తీసివేయుదురు. హేరోదు రాజు చిన్న పిల్లల ప్రాణములను ఎట్లు తీయించెనో మనమెరుగు



దుము. బాప్తిస్మమిచ్చు యోహాను తలను హేరోదు ఎట్లు తీయించెనో మనమెరుగుదుము. కాని ప్రపంచ చరిత్రలో మానవుల కొరకు చనిపోయిన రాజు యేసుక్రీస్తు ఒక్కరు మాత్రమే. ఏలయనగా ఆయన గొప్పరాజు. భిన్నమైన రాజు.

**యేసుక్రీస్తు యొక్క రాజ్యము భిన్నమైనది :**

యేసుని నమ్మిన యూదులును మరియు అపొస్తలులును ఆయన రాజ్యము ఇహసంబంధమైనదని తలంచిరి. దావీదు మరియు సోలోమోను రాజ్యముల వలె యేసుక్రీస్తు సువర్ణ పాలన అందించునని వారు ఎదురు చూచిరి. రోమా రాజ్యమును మరియు అన్య రాజ్యములన్నింటిని ఆయన నిర్మూలముచేసి, యెరూషలేము పట్టణములో దావీదు సింహాసనము మీద కూర్చుండి, యూదులను ఏలునని వారు తలంచిరి. అయితే "యేసు – నా రాజ్యము. ఈ లోకసంబంధమైనది కాదు. నా రాజ్యము ఈలోక సంబంధమైనదైతే నేను యూదులకు అప్పగింపబడకుందునట్లు నా సేవకులు పోరాడుదురు గాని నా రాజ్యము ఇహ సంబంధ మైనది కాదనెను" (యోహాను 18:36).

**అపొస్తలుల కార్యములు 1:6** : "కాబట్టి వారు కూడి వచ్చినప్పుడు ప్రభువా యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును మరల అనుగ్రహించెదవా? అని ఆయనను అడుగగా".

పరలోక రాజ్యము సమీపించియున్నదని బాప్తిస్మమిచ్చు యోహానును మరియు యేసుక్రీస్తును, అపొస్తలులను ప్రకటించిరి (మత్తయి 3:1,2; 4:17; 10:5–7). యేసుక్రీస్తు భూమి మీద పరిచర్య చేయుచున్నప్పుడు ఆయన రాజ్యము స్థాపించునని, భౌతిక సింహాసనముపై ఆయన ఆసీనుడగునని బహుశా వారు భావించుకొనిరి. ఆయన మరణించి తిరిగి లేచిన తరువాత 40 దినములు భూమి మీద ఉన్న దినములలో ఆయన సింహాస

నము మీద కూర్చుండునని వారు తలంచిరి. వారు భావించినట్లు ఆయన రాజ్యమును స్థాపించలేదు. పరమునకు ఆరోహణమగు సమయమున శిష్యులు తమ సందేహమును బయటపెట్టిరి. రాజ్యమును స్థాపించకుండగనే వెళ్ళుచున్న ఆయనను ప్రశ్నించిరి. రెండవ రాకడలో వచ్చినప్పుడు ఇశ్రాయేలునకు రాజ్యమును అనుగ్రహించెదవా? అని అడిగిరి. కారణం వారు ఆయన రాజ్యము భౌతికమైనదని తలంచిరి.

మత్తయి 16:18, 19 : "మరియు నీవు పేతురువు. ఈ బండ మీద నా సంఘమును కట్టుదును. పాతాళ లోక ద్వారములు దాని యెదుట నిలుపనేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను నీవు భూలోకమందు దేని బంధించుదువో అది పరలోకమందును బంధింపబడును. భూలోక మందు దేని విప్పుదువో అది పరలోకమందును విప్పబడునని అతనితో చెప్పెను".

సంఘము పరలోక రాజ్యమని ఈ వచనములలో యేసు చెప్పెను.

**అపొస్తలులు కార్యములు**

**2:41 :** "కాబట్టి అతని వాక్యము అంగీకరించిన వారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడు వేల మంది చేర్చబడిరి".

యేసుక్రీస్తు యొక్క రాజ్యము (సంఘము) పెంతెకొస్తు దినమందు యెరూషలేములో స్థాపించబడెను. అది కుమారుని యొక్క రాజ్యమని కొలస్స 1:13లో చెప్పబడినది. మరియు అది క్రీస్తు సంఘమని రోమా 16:16లో చెప్పబడినది. సంఘమే రాజ్యము, రాజ్యమే సంఘము. యేసుక్రీస్తు అను రాజును వెదకి, అనగా సువార్తకు లోబడి బాప్తిస్మము పొంది, ఆయన రాజ్యములో చేరి, సంతోషము పొందుమని నిన్ను కోరుచున్నాము.

-కె. ఎలీషా



## నీవు మాదిరి కరమైన క్రైస్తవుడవా?

ఒకని మాదిరి చాల ప్రభావము గలది. మాదిరిని బట్టి మనం నేర్చుకొంటాము, వింటాము, జీవిస్తాము. కొన్ని ఉదాహరణలు గమనించుము. అబ్రాహాము గొప్ప విశ్వాసము గలవాడు (రోమా 4:20). క్షమించుటలో యోసేపు చాల గొప్పవాడు (ఆది.కా. 50:20). మోషే గొప్ప నాయకుడు (నిర్గమ 14). దావీదు గొప్ప ధైర్యశాలి (1 సమూయేలు 19) మరియు యేసు మనకు పరిపూర్ణ మాదిరయై యున్నారు (2 కొరింధీ 5:21). 1 తిమోతి 4:12-16 నుండి ప్రభావంతమైన ఏడు క్రైస్తవ గుణములను గమనించుము.

**1. మాదిరికరమైన క్రైస్తవ నైతికత :** (12వ) మన మాటలు, ప్రవర్తన, ప్రేమ, స్వభావము, విశ్వాసము మన తలంపులలోను, మాటలలోను, క్రియలోను కనబరచవలెను. మన జీవితంతోనే మనం గొప్ప ప్రసంగమును చేయుచున్నాము (1 కొరింధీ 4:16; 11:1; ఫిలిప్పీ 3:17; 4:9).

**2. బైబిలు పునాది :** (13వ) "మాదిరిగా యుండుము", ఇప్పుడు, ఎప్పుడు, ఎల్లవేళలా మాదిరిగా యుండాలి. అంటే వాక్యమునకు ఎల్లవేళలా కట్టుబడి యుండాలి.

**3. దేవుడు అనుగ్రహించిన వరమును ఉపయోగించాలి :** (14వ) పెద్దల హస్తనిక్షేపణము వలన తిమోతి అద్భుత వరమును పొందియున్నాడు. మొదటి శతాబ్దములోపే అద్భుత వరములన్ని ఆగిపోయాయి (1 కొరింధి 13:8-12). గనుక వాడుక ద్వారా దైవ కటాక్షము వలన పొందిన సామర్థ్యమును ఉపయోగించాలి. దేవుడు మనకిచ్చిన తలాంతులను వినియోగించాలని తలాంతులను గూర్చిన ఉపమానము బోధించుచున్నది. మన తలాంతులను పాతిపెట్టకూడదు. దేవుడిచ్చిన దానిని ఆయన మహిమ కొరకు వినియోగించుదాము (1 కొరింధి 10:31).

**4. నీ అభివృద్ధి కనబడు జీవితమై యుండాలి** (15వ) : పవిత్రమైన జీవితం జీవించుటకు సంపూర్ణముగా సమర్పించుకోవాలి. పౌలు తన జీవిత ధ్యేయమును గూర్చి తేటగా ఎరిగియున్నాడు. "నా మట్టుకైతే బ్రదుకుట క్రీస్తే, చావైతే లాభము" అని చెప్పాడు (ఫిలిప్పీ 1:21, గలతీ 2:20).

**5. నీ వెలుగు ప్రకాశించాలి** (15వ): క్రైస్తవ్యము నిర్జీవమైనది కాదు గాని సమర్పించుకొనిన జీవితం. క్రైస్తవులు బలముగా నిలబడాలి, ప్రకాశవంతముగా ప్రజ్వరిల్లాలి, నమ్మకముగా జీవించాలి. యితరులు చూచి అనుకరించునట్లు మన జీవితం పవిత్రత కలిగినదైయుండాలి (1 పేతరు 1:13-16).

**6. సమర్పించుకొనిన పట్టుదల** (16వ) : మన జీవితంలో మనలను గూర్చి, లేఖనములను గూర్చి సహనము కలిగి యుండాలి. సహనమును బట్టి మనం శక్తివంతుల మవుదుము (హెబ్రీ 10: 32-39).

**7. తేటగా యున్న గమ్యము** (16వ) : రక్షణ మన గొప్ప అవసరము. మనకు మనమే పరీక్షించు కొనుచు, నిత్యత్వమును గూర్చి ఆలోచించుచు, సహించుచు యుంటే మన ధ్యేయము సరియైనదే. "క్రైస్తవ్యమును బట్టి ఈ లోకము క్రైస్తవులను గమనించుచున్నదని" మనం గుర్తుంచుకోవాలి.

**-మార్కొపోసే**


**మా వద్ద 25 రకములకు పైగా సువార్త సంబంధిత పుస్తకములున్నవి.**

**వాటి పోస్టేజి నిమిత్తము రూ. 120/-లు మాకు ఎమ్.ఒ. చేసి ఉచితముగా పొందండి**

**సత్యవాణి**

**7-9-35, సాంబమూర్తి వీధి, కాకినాడ - 533 004.**




# దేనిని గూర్చి చింతపడకుడి

మనం చింతపడకుండా వుండా లన్నా మన దైనందిన జీవితం సమస్య లతోను, పరిస్థితులతోను నిండి యున్నది. మనం వ్యక్తిగత ఆరోగ్య సమస్యలు, ఆర్థిక సమస్యలు, కుటుంబ భద్రత, జాతీయ అంతర్జాతీయ భద్రత మొదలగు వాటిని ఎదుర్కొనుచునే యున్నాము. ఈ అలజడులు, శోధనలు, బాధలు, రోగములను ఎదుర్కొనుచు క్రైస్తవులు ఎట్లు వాటితో సతమత మవ్వాలి? బైబిలు బోధనలను బట్టి నాలుగు సంగతులు మనం ఆలోచిం చాలి, నేర్చుకోవాలి.

**మొదటిగా మనం పొందిన ఆశీర్వాదములను లెక్కించుకోవాలి :** బహుక్లిష్ట పరిస్థితులలో యున్నను మనం పొందిన ఆశీర్వాదములను గమనించుకోగలము. మనకు ఆర్థిక సమస్యలుండవచ్చును గాని మంచి ఆరోగ్యముతో యుండవచ్చును. స్వాతంత్ర్యము, యితరులవలన పొందే ప్రేమ, సహవాసములను లెక్కింప వచ్చును. సమస్త ఆత్మీయాశీర్వాద ములు మనం అనుభవించుచున్నాము. (ఎఫెసీ 1:3).

**రెండవదిగా మనం ప్రార్థన చేయాలి :** అపొ.పౌలు ఫిలిప్పీ 4:4-7లో ఇట్లు హెచ్చరించాడు: "ఎల్ల ప్పుడును ప్రభువునందు ఆనందించుడి, మరల చెప్పుదును ఆనందించుడి. మీ సహనమును సకలజనులకు తెలియ బడనియ్యుడి. ప్రభువు సమీపముగా ఉన్నాడు. దేనిని గూర్చియు చింత పడకుడి గాని ప్రతివిషయములోను ప్రార్థన విజ్ఞాపనములచేత కృతజ్ఞతా పూర్వకముగా మీ విన్నపములు దేవునికి తెలియజేయుడి. అప్పుడు సమస్త జ్ఞానమునకు మించిన దేవుని సమాధానము యేసుక్రీస్తు వలన మీ హృదయములకును, మీ తలంపు లకును కావలి యుండును" (ఫిలిప్పీ 4:4-7). మరల ప్రభువు ఇట్లు

చెప్పారు. "అడుగుడి మీకియ్యబడును, వెదకుడి మీకు దొరుకును, తట్టుడి మీకు తీయబడును. అడుగు ప్రతి వాడును పొందును, వెదకువానికి దొరుకును, తట్టువానికి తీయబడును. మీలో ఏ మనుష్యునికైనను తన కుమారుడు తన్ను రొట్టెనడిగిన యెడల వానికి రాతినిచ్చునా? చేపనడిగిన యెడల పామునిచ్చునా? మీరు చెడ్డ వారై యుండియు మీ పిల్లలకు మంచి ఈవులనెరిగి యుండగా పరలోక మందున్న మీ తండ్రి తన్ను అడుగు వారికి అంతకంటె ఎంతో నిశ్చయముగా మంచి ఈవుల నిచ్చును" (మత్తయి 7:7-11).

జ్ఞానము కొరకు ప్రార్థించాలి (యాకోబు 1:5). అంతరంగిక బలము కొరకు (ఎఫెసీ 3:14-16) దైనందిన అవసరముల కొరకు, క్షమాపణ కొరకు, అపవాది నుండి విడుదల కొరకు, నడిపింపు కొరకు మనం ప్రార్థించాలి (మత్తయి 6:14-16). రోగుల కొరకు, అంగహీనుల కొరకు, నిస్సహాయుల కొరకు ప్రార్థించాలి.

**మూడవదిగా అన్ని శక్తుల కన్నా తన బిడ్డల యెడల దేవునికున్న ప్రేమ గొప్పది అని గుర్తుంచుకోవాలి :** సమస్తమును దేవుని కంట్రోలులో యున్నదని, ఆయన మనలను కాపాడు చున్నాడని రోమా 8:28-29 బోధించు చున్నది. దేవుని ప్రేమించువారికి సమస్తమును సమకూడి జరుగు చున్నవి. దేవుడు మన పక్షమున నుండగా మనకు విరోధియెవడు? క్రీస్తు ప్రేమ నుండి మనలను ఎడబాపు వాడెవడు? శ్రమయైనను, బాధయైనను, హింసయైనను, కరువైనను వస్త్రహీనతయైనను, ఉపద్రవమైనను, ఖడ్గమైనను మనలను ఎడబాపునా? అయినను మనలను ప్రేమించిన వాని ద్వారా వీటన్నిటి విషయములో అత్యధిక విజయము పొందుచున్నాము (రోమా 8:29-36).

**చివరిగా ఇంకొకరి కొరకు నీవు ఏమైనా చెయ్యి :** యాకోబు 2:14,15, 17 ఇట్లు చెప్పుచున్నది : "నా సహోదరులారా క్రియలులేనప్పుడు ఎవడైనను తనకు విశ్వాసము కలదని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? అట్టి విశ్వాసమతని రక్షింపగలదా? సహోదరుడైనను సహోదరియైనను దిగంబరులై ఆనాటికి భోజనము లేక యున్నపుడు మీలో ఎవడైనను శరీరమునకు కావలసిన వాటిని ఇయ్యక సమాధానముగా వెళ్ళుడి, చలికాచు కొనుడి తృప్తి పొందుడని చెప్పిన యెడల ఏమి ప్రయోజనము? ఆలాగే విశ్వాసము క్రియలు లేనిదైతే అది ఒంటిగా ఉండి మృతమైనదగును''. రోగులకు అనాథలకు సహాయము చేయుము. జ్ఞానవివేకము కలిగి ప్రవర్తించుము. మంచి జరిగించుటకు ప్రయత్నము చేయుము.

మనం అనుదిన సమస్యల నుండి తప్పించుకొనజాలము. బైబిలు జ్ఞానముతో వాటిని ఎదుర్కొనాలి. లేదా అపజయము నొందుదుము. విశ్వాసముతో సమస్యల నెదుర్కొనుటకు ప్రయత్నించుము. నావల్లకాదని బలహీనపడకుము. మేలు చేయుటకు ఒక శక్తిగా నుండుటకు ఎంచుకొనుము.

**-వేయిన్ బేరియర్**

## అతిశ్రేష్ఠమైన వర్తమానము

ఆయన రాజులకు రాజును ప్రభువులకు ప్రభువును యని పిలువబడ్డారు తేజోమయుడును, ఉదయ నక్షత్రమునగు రక్షకుడాయన. ఆయన ఆలోచనకర్త, సమాధాన కర్తయగు అధిపతి, లోక రక్షకుడు. అభిషిక్తుడైన ఆయనకు అనేక నామములును బిరుదులును ఉన్నవి. ఆయనే యేసు క్రీస్తు. ఆయన మనకు అనుగ్రహింపబడిన అతిశ్రేష్ఠమైన వర్త మానము.

ఆ వర్తమానము మనకు కావలసి యున్నది. బంగారు వాక్యభాగము అని చెప్పబడే యోహాను 3:16 అత్యంత ప్రేమామయుడైన

యేసుక్రీస్తును మనకు బహూకరించుచున్నది. మున్నెన్నడు ఇట్టి రీతిగా ప్రేమ వర్ణించ బడలేదు. మరల వర్ణించ బడదు. యదార్ధవంతుడైన దేవుని న్యాయము శాంతించబడాలంటే, దానికవునరమైన మూల్యము చెల్లించుట మన వల్లకాదని ఎరుగుదుము, ఆ మూల్యమును ఆయన మన కొరకు చెల్లించారు. పాపరహితు డైన తన కుమారుని దేవుడు మన కొరకు అర్పించారు. వర్ణింప నలవికాని ఆయన వరము కొరకు దేవునికి స్తోత్రములు!

**ఆ బహుమతి అనుసరణీయము.** అది పరిపూర్ణము "కాబట్టి తీర్పు ఒక్క అపరాధమూలమున వచ్చినదై మనుష్యుల కందరికిని శిక్షావిధి కలుగుటకు ఏలాగు కారణమాయెనో ఆలాగే ఒక పుణ్యకార్యము వలన కృపాదానము మనుష్యులందరికిని జీవప్రదమైన నీతి విధింపబడుటకు కారణమాయెను" (రోమా 5:18). యేసుక్రీస్తు ద్వారా మన దైనందిన అవుసరములు తీర్చబడుచున్నాయి. వర్ణింపనలవి కాని ఆయన వరము కొరకు దేవునికి స్తోత్రములు!

**ఆ బహుమతి ఎల్లకాలము నిలుచును :** మనము ఎదుటి వానితో మాట్లాడుచున్నప్పుడు అతని మనస్సు కూడ తెలిసికోగలిగితే అది ఆశ్చర్యము. యాకోబు బావిదగ్గర సమరయ స్త్రీతో యేసు మాట్లాడుచు. "నీవు దేవుని వరమును నాకు దాహమునకిమ్మని నిన్ను అడుగుచున్నవాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు. ఆయన నీకు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను" (యోహాను 4:10).

పాపభారము వలన ఈ వరము లేకపోతే మన ఆత్మీయ తృష్ణ తీరక యుండును. క్రీస్తులో ఎన్నడు ఆరిపోని ఈ కృపాజీవజలములను మనము సమృద్ధిగా కలిగియున్నాము. నేనిచ్చు నీళ్ళు త్రాగువాడెప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను" (యోహాను 4:14).



వర్ణింపశక్యము కాని ఆయన వరమునకు స్తోత్రములు.

దేవుని శ్రేష్టమైన వరమును గ్రహించిన తరువాత దానిని యితరులతో పంచుకొందురని నా ప్రార్ధనయై యున్నది (మత్తయి 28:18–20). విచారం యేమంటే క్రైస్తవులలో అనేకులు వ్యక్తిగత సువార్త చేయుట మానివేసారు. వారు క్రైస్తవులకు తప్ప యితరులకు తమ రాజును గూర్చి యితరులకు చెప్పరు. నీవట్లు చేయకుందువుగాక.

**–గ్లైర్ కోలీ**

## జ్యోతిష శాస్త్రం

కాలారంభము నుండి మానవుడు తన సమస్యలకు జవాబును వెదకుచున్నాడు. అనేకులు నక్షత్రములను చూచి, వాటిని గమనించి వారి సమస్యలకు పరిష్కారము దొరుకునను కొనుచున్నారు. జ్యోతిష్కం, జ్యోతిశాస్త్రము ఐగుప్తుదేశములో ఫరో రాజులున్నప్పటినుండి మన మధ్య యున్నది (నిర్గమ 7:11ను చూడండి).

నేడు మనకు తెలిసిన జ్యోతిష్కం ఒక శాస్త్రము వలె కల్దీయుల నుండి వచ్చినది. వారు నేడు మన మెరిగిన రాశిచక్రములను అను సిద్ధాంతమును ప్రవేశపెట్టిరి. రోమాసామ్రాజ్యము యొక్క వ్యవహారములను నిర్ణయించుటకుగాను రోమాచక్రవర్తులగు తిబెరియ, నీరోలు జ్యోతిశాస్త్రమును బట్టి ప్రవర్తించేవారు. చరిత్రలో ప్రముఖులుగాని, సామాన్యులు గాని తమ ప్రశ్నలకు జవాబు కొరకు జ్యోతిష్యమును అనుసరించారు.

దీనిని గూర్చి బైబిలు యేమి చెప్పుచున్నది? "శకునములు చూడకూడదు. మంత్రయోగములు చేయకూడదు" (లేవి 19:26). "జ్యోతిష్కులు, నక్షత్ర సూచకులు మాస చర్య చెప్పువారు నిలువబడి నీ మీదికి వచ్చునవి రాకుండ నిన్ను తప్పించి


రక్షించుదురేమో ఆలోచించుము" (యెషయా 47:13). జ్యోతిష్కం విషయంలో మనవేమి చేయాలో ఇక్కడ ప్రభువు యొక్క ఆజ్ఞ మనకున్నది.

మొదటిగా జ్యోతిష్కం మన ప్రశ్నలకు జవాబీయదు, మన సమస్యలకు పరిష్కారము చూపదు. రెండవదిగా ప్రభువు ఇట్టి పనులను కాల్చివేయును. ఇంకా ఎక్కువ చెప్పవలెనా? యిర్మీయా 10:2లో ఆయన ఇట్లు హెచ్చరించుచున్నారు. "అన్యజనుల ఆచారముల నభ్యసింపకుడి. ఆకాశమందు అగపడు చిహ్నములకు జనములు భయపడును, అయితే మీరు వాటికి భయపడకుడి".

క్రొత్తనిబంధనలో అపో.పౌలు ఎఫెసులో యున్నప్పుడు మాంత్రికులును, జ్యోతిష్కులైన అనేకులు పౌలు బోధించిన సత్యసువార్తను విని "విశ్వసించినవారు అనేకులు వచ్చి తాము చేసిన వాటిని తెలియజేసి ఒప్పుకొనిరి. మరియు మాంత్రిక విద్యనభ్యసించిన వారు అనేకులు తమ పుస్తకములను తెచ్చి అందరి యెదుట వాటిని కాల్చి వేసిరి" (అపొ.కా. 19:17-20). ఇంత ప్రభావముతో ప్రభువు వాక్యము ప్రబలమై వ్యాపించెను.

మన ప్రశ్నలకు, సమస్యలకు జవాబు దొరుకు ఒకే ఒక్క స్థావరమున్నది. అది మన ప్రభువైన యేసుక్రీస్తే. "నేను చెప్పుమాటలు ఆత్మయు జీవమునై యున్నవి" యని ఆయనే చెప్పెను (యోహాను 6:63).

**-ఈవన్ అడైర్**





# గొప్ప సువార్త ప్రసంగము

మనము గొప్ప శక్తితో బోధించి మంచి ఫలితములను సాధించాలంటే మనము దిగువ వాస్తవ ములను విశ్వాసముతో బోధించాలి :

**క్రీస్తు లేకుండా ఎవడు రక్షింపబడజాలడు :** "నా ద్వారానే తప్ప ఎవడును తండ్రి యొద్దకు రాడు" అని యేసు చెప్పారు (యోహాను 14:6). "ఈ నామముననే రక్షణ పొందవలెను గాని, ఆకాశము క్రింద మనుష్యులలో ఇయ్యబడిన మరి ఏనామమున రక్షణ పొందలేము" (అపొ.కా.4:12). మనుష్యులు క్రీస్తును గూర్చి వింటేనే గాని జీవించలేరు. సువార్త అందరికీ. ఈ లోకం ఉన్నా రీతిగానే అంతా బాగుంటే, వాళ్లకు ఇంకా ఏమి చెప్పగలము? ఈ లోకం ఎరుగనిది మనం ఎరుగుదుమని హృదయ పూర్వకముగా నమ్మితే, దానిని ఆసక్తితో వారికి ప్రచురించుదుము.

**రక్షించుటకు సువార్త దేవుని శక్తియై యున్నది :** "సిలువను గూర్చిన వార్త నశించుచున్నవారికి వెర్రితనము గాని రక్షింపబడుచున్న మనకు దేవుని శక్తియై యున్నది" (1 కొరింథి 1:18). "సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడను కాను ఏలయనగా నమ్ము ప్రతివానికి రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది" (రోమా 1:16). తన కుమారుని బలియిచ్చుట ద్వారా దేవుడు బయలుపరచిన ప్రేమ మనలను దేవుని యొద్దకు ఆకర్షించును (యోహాను 12:32, 33). ప్రేమించుటకు అది నడిపించును (1యోహాను 4:19). సువార్త త్రాగుబోతును, మత్తు మందుబాబులను మార్చి సద్వర్తనులుగా చేయును. అబద్ధ బోధకునికి అది దేవుని మార్గమును మరింత విపులముగా విశదీకరించును. స్వార్థపరుడైన లోభిని సంతోషముగా యిచ్చువానిగా చేయును. సువార్త వాక్యము దేవుని కుమారుని స్వరము నిత్యజీవమును ప్రసాదించును, నిత్య నరకము నుండి మనలను తప్పించును

# సంక్షిప్త వార్తలు

ఆంధ్రాలో కరోనా తగ్గుముఖము పట్టినందున సత్యవాణి సువార్త పరిచర్యలు మరల కొంతమట్టుకు పుంజుకొన్నాయి. రిక్కీగూటం గారు ఇక్కడ ఇండియాలోను, రోనీగూటం గారు అమెరికాలోను విరివిగా పలుప్రాంతములు సందర్శించి సువార్త చాటుటలో నిమగ్నులైయున్నారు.

2021 అక్టోబరు 4వ తేదీనాడు ఏలేశ్వరంలోయున్న క్రీస్తుసంఘము ఏర్పాటుచేసిన సువార్త కూటములో రిక్కీ గూటం గారు వాక్యపరిచర్య చేసిరి.

2021 అక్టోబరు 5వ తేదీ నాడు పెద్దాపురం లెప్పర్ కాలనీలో యున్న క్రీస్తుసంఘము సువార్తకూటమును ఏర్పాటుచేయగా అక్కడ రిక్కీగూటం గారు వాక్యపరిచర్య చేసిరి. మరల సెప్టెంబరు 23న పెద్దాపురంలోను, సెప్టెంబరు 29న వెంకటకృష్ణరాయపురంలోను మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటుచేసి అక్కడవున్న అనేకులకు ఉచిత వైద్య పరీక్షలు చేయించి, అవుసరమైనంత మట్టుకు వారికి ఔషధములు కూడా సరఫరాచేసిరి.

2021 అక్టోబరు 11వ తేదీ నాడు రిక్కీగారు, జాషువా గారి కుటుంబము రెండుదినముల మట్టుకు విజయనగరం, విశాఖపట్టణములలో గడిపిరి. అంతకు ముందు 9వ తేదీన చింతపల్లిలోను, 6వ తేదీన వెంకటాపురంలోను జరిగిన సువార్త సభలలో రిక్కీగూటం గారు, స్థానిక సువార్తికులు వాక్యపరిచర్య చేసిరి. 6వ తేదీ సాయంత్రం బి.కె.పల్లిలో జరిగిన సభలో రిక్కీ గారు వాక్యపరిచర్య చేయగా 5గురు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. అక్కడ సత్తిరాజు గారు పరిచర్య చేయుచున్నారు.

2021 అక్టోబరు 22న కత్తిపూడి మండలం శాంతి ఆశ్రమంలో జరిగిన రెండురోజుల సువార్తకూడికలలో రిక్కీగారు వాక్యపరిచర్య చేసిరి. అక్కడ సోదరులు సిరోరాజ్యం గారు చక్కటి సేవలనందించుచున్నారు.

2021 అక్టోబరు 11వ తేదీన రిక్కీగారు ఒంగోలు పట్టణమును దర్శించి అక్కడవున్న కొన్ని స్థానిక సంఘములను సహోదరులను కలిసికొని సహోదరులను సహవాసములో ప్రోత్సహించిరి.

అక్టోబరు 25వ తేదీ సోమవారం కాకినాడ సత్యవాణిలో సువార్తికుల కూడిక జరిగెను. దానిలో మతశాఖలకు చెందిన కొందరు ప్రముఖులు కూడ హాజరైరి. రిక్కీగారు చేయుచున్న ఆత్మీయ, సాంఘిక కృషిని అభినందించిరి.

అమెరికాదేశములో వుండి రోనీగూటం గారు సత్యవాణి స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్‌ను విజయవంతముగా నడిపించుచున్నారు. భారతదేశంలో యున్న విద్యార్థులకు ఆన్‌లైన్‌లో బోధించుటకుగాను వారు అమెరికాలో అర్ధరాత్రి వరకు కృషిచేయుచున్నారు. మరియు ఇండియాలో జరుగు సేవార్ధమై అక్కడ పలు రాష్ట్రములు, సంఘములు దర్శించుచున్నారు.

సత్యవాణి స్కూల్ ఆఫ్ ఎవాంజలిజమ్‌లో జరుగు ఆన్‌లైన్ క్లాసులకు హాజరు కావాలనుకొనేవారు సత్యవాణి ఆఫీసుకు ఫోన్ చేసి వివరములు తెలిసికొనండి లేదా 0884 – 2363722కు గాని 98489 98547కు ఫోన్ చేయండి.